ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా..

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- స్పెషలిస్ట్ వైద్యులతో పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు


జబ్బరతోటలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్లు ఉరుకూటి నారాయణరావు,జానకీరామ్

దాబాగార్డెన్స్: ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ప్రజలకు వైద్యసేవలు చేరువ చేసేలా రూపొందించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. నియోజకవర్గ పరిధిలోని జబ్బరతోట, కొబ్బరితోట, రైల్వే న్యూకాలనీల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు వస్తున్న జనమే నిదర్శనం. జబ్బరతోటలో నిర్వహించిన శిబిరాన్ని 29, 37 వార్డుల కార్పొరేటర్లు ఉరుకూటి నారాయణరావు, చెన్నా జానకీరామ్ కలిసి ప్రారంభించారు. యూపీహెచ్‌సీ సిబ్బందితో పాటు సచివాలయ ఏఎన్‌ఎంలు, వలంటీర్లు ఇంటింటికి తిరిగి వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి తక్షణ వైద్య పరీక్షలు చేయడంతో పాటు మెరుగైన వైద్యం అవసరమైన వారికి టోకెన్లు ఇచ్చి శిబిరాలకు హాజరు కావాలని సూచించడంతో వారంతా శిబిరానికి హాజరయ్యారు. శిబిరంలో జనరల్ ఫిజీషియన్‌తో పాటు స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉండి వైద్య పరీక్షలు చేశారు. సాధారణ పరీక్షలతో పాటు షుగర్, బీపీ, ఆర్థో, గైనిక్, కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో 29, 37వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల యేసు, కాసారపు వాసు, రెయ్యి డేవిడ్‌రాజు, సత్యవతి, నిమ్మకాయల ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఆకట్టుకుంటున్న ఫుడ్‌స్టాల్

ఆకట్టుకున్న ఫుడ్ స్టాల్

శిబిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్ ఆకట్టుకుంది. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ ఇందిర నేతృత్వంలో పోషకాహార ప్రదర్శన చేపట్టారు. కొర్రలు, ఉలవలు, కొమ్ము శనగలు, జొన్నలు, పెసలు, రాజ్మా, అరికలు, గోధుమలు, చోడిపిండి అట్లు, ఆకుకూరలతో రాగిపిండి ఆమ్లెట్, బొబ్బర్లు, వేరుశనగలు, సజ్జలు, ఆకుకూర చపాతీలు, మినుములు, రాగులు, సామలు, రాగిపిండి లడ్డూలు, బాలామృతంతో జంతికలు, బాలమృతంతో లడ్డూ, అంబలి, రాగిపిండి పిట్టు తదితర పోషకాలతో కూడిన వంటకాలతో ఏర్పాటు చేసిన స్టాల్ ఆకట్టుకుంది.

ఆకట్టుకున్న ఫ్లాష్‌మాబ్


ఫ్లాష్‌మాబ్ నిర్వహిస్తున్న నేవల్ స్కూల్ విద్యార్థులు

మద్దిలపాలెం: నేవీ స్కూల్ విద్యార్థులు మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో సోమవారం ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. ఆరోగ్యకరమైన జీవనం అలవర్చుకోవాలని సూచిస్తూ చేసిన డ్యాన్స్ ఆకట్టుకుంది. విశాఖలో నవంబర్ 5న జరిగే నేవీ మారథాన్, నేవీ డే వేడుకల్లో భాగంగా ఈ ఈవెంట్‌ను నిర్వహించినట్టు విద్యార్థులు తెలిపారు. నేవీ మారథాన్‌లో ఫుల్ మారథాన్ 42.2 కిలోమీటర్లు కాగా, హాఫ్ మారథాన్ 21.1 కిలోమీటర్లు, 10కే రన్, 5కే రన్ నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు https:// www. vizagnavymarathon. run/ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

దుర్గమ్మ ఉత్సవాలకు శ్రీకారం


పందిరి రాట మహోత్సవంలో పాల్గొన్న తోట పద్మావతి తదితరులు

అల్లిపురం: డాల్ఫిన్ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో దుర్గమ్మ ఉత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి పాల్గొని పందిరి రాట వేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగోలు శ్రీను, లండా రమణ, దుర్గారావు, దూడ అప్పారావు, పిల్లి సత్తిబాబు, ఆటో స్టాండ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గణేషన్నా ..బాగున్నారా

- సీఎం ఆత్మీయ పలకరింపు


సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్: ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు సోమవారం విశాఖ విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వాసుపల్లి గణేష్‌కుమార్ హెలీప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందజేసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లిని.. గణేషన్నా.బాగున్నారా.. అంటూ సీఎం ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ముఖ్యమంత్రి కార్యక్రమాల్లో వాసుపల్లి పాల్గొన్నారు. విశాఖను ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి, దేశంలో అగ్రగామిగా విశాఖను తీర్చిదిద్దుతున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

ఈ ట్యాంకర్ ఎవరిది?


రాణీబొమ్మ జంక్షన్‌లో పార్క్ చేసి ఉన్న ట్యాంకర్

జగదాంబ: స్థానిక 39వ వార్డు పాతపోస్టాఫీసు సమీపాన గల రాణీబొమ్మ జంక్షన్‌లో ట్యాంకర్ (ఏటీవీ 5909) సుమారు ఏడాదిగా పార్క్ చేసి ఉంటోంది. ఈ వాహనం మరమ్మతులకు గురవడంతో డ్రైవర్ ఇక్కడ పార్క్ చేసి ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు. ఈ మార్గంలో సిటీబస్సులు అధికసంఖ్యలో ప్రయాణిస్తాయి. ఈ ట్యాంకర్ ఎదురుగానే బస్టాప్ కూడా ఉంది. జంక్షన్‌లో ట్యాంకర్ కారణంగా ఒక్కోసారి ట్రాఫిక్‌కి ఇబ్బందవుతోందని వాహన చోదకులు తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఏడాదికి పైగా ట్యాంకర్ పార్క్ చేసి వదిలేసినా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడాన్ని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ట్యాంకర్‌ని తరలించేలా యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'కార్మికులకు దసరాలోగా బోనస్ చెల్లించాలి'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు దసరాలోగా బోనస్ చెల్లించాలని స్టీల్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ మిత్రపక్షాల ఆధ్వర్యంలో సోమవారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ స్టీల్ కార్మికులకు బోనస్ చెల్లింపుపై యాజమాన్యం తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. గతేడాది కంటే అదనంగా బోనస్ చెల్లింపుతో పాటు గతేడాది బకాయి రూ.9500 కూడా కలిపి కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.టి.దాస్, యు.రామస్వామి, మిత్ర పక్షాల నాయకులు డి.వి. రమణారెడ్డి, సురేష్‌బాబు, సన్యాసిరావు ప్రసంగించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. అనంతరం సీఎండీ అతుల్ భట్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

నేడు స్టీల్‌ప్లాంట్‌లో వైఎస్సార్‌టీయూసీ ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఉక్కు ట్రైనింగ్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నారు. కార్మికులకు దసరా ముందు బోనస్ చెల్లించాలని, గతేడాది పెండింగ్ బోనస్ రూ.9500 చెల్లించాలన్న డిమాండ్లపై ధర్నా చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు నిర్వహించనున్న ధర్నాలో యూనియన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గోవాలని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా

- జోన్–3 కమిషనర్ శివప్రసాద్
- ప్రత్యేక వైద్య శిబిరాలకు విశేష స్పందన


మహిళకు కంటి పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది, పరిశీలిస్తున్న జెడ్సీ శివప్రసాద్, తదితరులు

అల్లిపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజల ఆరోగ్యానికి భరోసానిస్తోందని జోన్–3 కమిషనర్ శివప్రసాద్ అన్నారు. జీవీఎంసీ 33వ వార్డు కుమ్మరవీధి సచివాలయం పరిధిలోని కొబ్బరితోట డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం సోమవారం నిర్వహించారు. 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, పార్టీ సీనియర్ నాయకుడు పాల శ్రీహరిరెడ్డి పాల్గొని పర్యవేక్షించారు. ఈ శిబిరంలో 245 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. నలుగురిని మెరుగైన వైద్యం నిమిత్తం రిఫర్ చేశారు. కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేయనున్నారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ ఇంటి దగ్గరలో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తలు పోషకాహారం, వాటి వల్ల కలిగే లాభాలు వివరిస్తూ స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తాతబ్బాయి, దూడ అప్పారావు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.


పోషకాహారం ప్రత్యేకతను వివరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వినతుల పరిష్కారానికి చర్యలు

కంచరపాలెం: ప్రజా వినతుల తక్షణ పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఐదు అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని జెడ్సీ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 01, యూసీడీ విభాగానికి 01, ఇంజినీరింగ్ విభాగానికి 01, పబ్లిక్ హెల్త్ విభాగానికి 01, రెవెన్యూ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో జోనల్ సూపరింటెండెంట్–1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్–2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, డీఈ భరణికుమార్, టౌన్ ప్లానింగ్ టీపీవో అసిస్టెంట్ అపరంజిత, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఎస్‌ఎస్ జనార్దన్, టీపీఆర్వో ఏపీడీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


వినతులు పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత

ఎంవీపీ కాలనీ: బాల్య వివాహ రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభారాణి కోరారు. సోమవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో ప్రతిజ్ఞ పేరిట స్వయం సహాయక సంఘాల సమక్షంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా ఏపీని నిలపడంలో స్వయం సహాయక సంఘాలు ప్రత్యేక పాత్ర పోషించాలన్నారు. చిన్న వయస్సులో పెళ్లి చేయడం వల్ల కలిగే అనర్థాలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండే వరకు వివాహం చేయకూడదన్నారు. బాల్య వివాహంలో పాల్గొనడం, ప్రోత్సహించడం చట్ట విరుద్ధమన్నారు. అమ్మాయిలను చదువు, ఉద్యోగ అవకాశాల్లో ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ అభివృద్ధి అధికారి పూర్ణిమాదేవి, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శోభారాణి

తొలగించిన చెట్లకు పునర్జన్మ

ఏయూ క్యాంపస్: తొలగించిన చెట్లకు తిరిగి ప్రాణం పోస్తున్నారు విశాఖలోని మహానగర పాలక సంస్థ అధికారులు. ఇటీవల కాలంలో పోలమ్మ గుడి నుంచి ప్రభుత్వ మానసిక ఆరోగ్య కేంద్రం కలుపుతూ వీఎంఆర్‌డీఏ పార్క్ వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా అడ్డుగా ఉన్న చెట్లను తొలగించారు. ఇలా సోమవారం ఉదయం మెంటల్ హాస్పిటల్ జంక్షన్ నుంచి వీఎంఆర్‌డీఏ పార్కు వరకు రోడ్డుకు ఇరువైపులా అడ్డుగా ఉన్న చెట్లను క్రేన్లతో జాగ్రత్తగా బయటకు తీశారు. వెంటనే చెట్ల వేళ్ల, ఎండిపోకుండా గోనె సంచి చుట్టి నీళ్లతో తడుపుతున్నారు. ముందుగా తీసి ఉంచిన గోతుల్లో వాటిని జాగ్రత్తగా పెట్టి మళ్లీ జీవం పోస్తున్నారు. రాణి చంద్రమణి హాస్పిటల్ దగ్గర తొలగించిన చెట్టుకు పునర్జన్మనిచ్చారు.


చెట్లను తరలిస్తున్న సిబ్బంది

హక్కులను హరించేందుకే ప్రైవేటీకరణ

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల, ఉక్కు భూనిర్వాసితుల హక్కులను హరించేందుకే స్టీల్ ప్లాంట్ పరిశ్రమను ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్రప్రభుత్వం పావులు కదుపుతోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 977వ రోజు సోమవారం, స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. పోరా ట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కార్మికులు అహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు అటువంటి పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలన్నారు. కార్మికులు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి, ప్రజా ఉద్యమంగా మలచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


దీక్ష శిబిరంలో పాల్గొన్నపోరాట కమిటీ నాయకులు

రాచపోలమాంబ ఆలయంలో హోమం

అల్లిపురం: గోకుల్ థియేటర్ దరి శ్రీరాచపోలమాంబ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు డి.బాలగంగాధర్ తిలక్, బి.మురళీకృష్ణశర్మ, బి.వెంకటరావు, బి.మహాలక్ష్మి, ఎ.విజయలక్ష్మి, డి.నూకరాజు, పార్థసారథి తదితరులు పాల్గొని హోమ కాటుకను స్వీకరించారు.

అన్నపూర్ణాదేవిగా కన్యకాపరమేశ్వరి

- అమ్మవారికి 102 మంది కన్యల పూజలు
- కలశాలతో యువతుల ప్రదక్షిణ


కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న కన్యా పూజకు వస్తున్న కన్యలు


అన్నపూర్ణాదేవిగా ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి

దాబాగార్డెన్స్: కన్యకాపరమేశ్వరి అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కురుపాం మార్కెట్ సమీపంలోని ఆలయంలో అమ్మవారిని బియ్యం బస్తాలతో అలంకరించారు. కంకటాల కృష్ణారావు, కుమారి దంపతులు, వారి కుమారులు సతీష్, నవీన్‌కుమార్ ఈ బియ్యం బస్తాలను అందించారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

నేత్రపర్వంగా కన్యల పూజ

సంప్రదాయ వస్త్రాలను ధరించిన 102 మంది కన్యలతో అమ్మవారికి కన్యాపూజ జరిపించారు. పూజ అనంతరం కన్యలు అందరూ శుద్ధ జలంతో కూడిన కలశాలతో గ్రామ ప్రదక్షిణ చేశారు. దేవాలయం నుంచి పప్పుల వీధి, శివాలయం వీధి మీదుగా అమ్మవారి ఆలయం వరకు ప్రదక్షిణ సాగింది. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పెన్నం వెంకటరత్నం నేతృత్వంలో సౌందర్యలహరి గ్రూప్‌చే భాగవతం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరిశెట్టి దినకర్, గ్రంథి రామకృష్ణారావు, పూసర్ల సురేష్‌కుమార్, సుగ్గు అరుణ్‌కుమార్, దోమా వెంకట సతీష్‌కుమార్, కంకటాల సతీష్ పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా సాగరదుర్గ

అల్లిపురం: యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ.. గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులుతీరారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకుడు ఫణికుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు.

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ జంక్షన్‌లోని శ్రీదుర్గాలమ్మ అమ్మవారు బాలాత్రిపుర సుందరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. దేవస్థానం ఈవో పి.శేఖర్ బాబు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు. అర్చకులు అమర్‌నాథ్, కృష్ణ అమ్మవారికి పూజలు నిర్వహించారు.


కన్యల పూజలో పాల్గొన్న యువతులు


కలశాలతో అమ్మవారి దర్శనానికి బారులు తీరిన కన్యలు

పసుపు కొమ్ముల అలంకరణలో ఎర్నిమాంబ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయంలో అమ్మవారిని సుమారు 10 లక్షల పసుపు కొమ్ములతో అలంకరించారు. దేవదాయ ధర్మదాయ శాఖ ఈవో డి.వి.ఎస్.సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాంత్‌శర్మ అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.


పసుపుకొమ్ముల అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు


గాయత్రిదేవిగా సాగరగిరి కనకదుర్గమ్మ


బాలాత్రిపుర సుందరిదేవి అలంకరణలో దుర్గాలమ్మ అమ్మవారు

ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంఘం అధ్యక్షురాలిగా వసంతలక్ష్మి


వై.వసంతలక్ష్మి

అల్లిపురం: ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంఘం విశాఖపట్నం అధ్యక్షురాలిగా న్యాయవాది వై.వసంతలక్ష్మి ఎన్నికయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో ఆదివారం జరిగిన సంఘం ఎన్నికల ఫలితాలను సంఘం కార్యదర్శి రాయి శ్రీనివాస, ఎన్నికల అధికారి కేపీ దేశాయ్ ప్రకటించారు. కార్యవర్గ సభ్యులుగా ఎం.వి.లక్ష్మి, కె.నాగకుమారి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బి.విజయకుమార్, పద్మాబాయ్, సంయుక్త కార్యదర్శులుగా వి.జాన్‌డేవిడ్‌రాజు, వి.నీలిమ, వై.శ్రీనివాసరావు, కోశాధికారిగా పి.ఆనంద్‌కుమార్‌తో సహా 11 మంది కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. నూతన కార్యవర్గానికి బార్ కౌన్సిల్ సభ్యులు బైపా అరుణ్‌కుమార్, సంఘం మాజీ అధ్యక్షుడు పాకా సత్యనారాయణ, హేమామాలిని, కేఎస్ సురేష్‌కుమార్, సాకా రాజేంద్రప్రసాద్, బలగ సత్యారావు, టి.సత్యారావు అభినందనలు తెలియజేశారు.